డేగతో బరిలోకి దిగాడు. పుంజులు రెండూ మంచి కండ పుష్టితో ఉన్నాయి. వాటి కాలి గోళ్లు, ముక్కూ బలంగా మొనదేలున్నాయి. చూడ్డానికి వచ్చినవారు వాటి బలాబలాలు అంచనావేసి వేలల్లో పందేలు కాసారు.

సూరిబాబు, పడమటయ్య పుంజుల తలలను వాటి ముక్కుతో పొడిపించి, వాటిలో క్రోధాన్ని రగిలించారు. వాటిని దువ్వి బరిలో వదిలి పక్కకు తప్పుకొన్నారు. సేతువ, డేగ ఎదురెదురుగా నిల్చుని కాళ్లొంచి, మెడ మీద ఈకలు రిక్కించి కాసేపు కోపంగా చూసుకున్నాయి. ఒక్కసారిగా గాల్లోకెగిరి తన్నుకున్నాయి. ముక్కులతో పొడుచుకున్నాయి. సేతువ ఎగురుతున్నప్పుడు డేగ ఒడుపుగా తప్పించుకుంటున్నది. జనం వాటి పోరును ఆసక్తిగా తిలకిస్తున్నారు. పడమటయ్య అయితే ఊపిరి బిగబట్టి చూస్తున్నాడు.

'బగవొంతుడా... పుంజులకేటవ్వకుండ నా డేగ గెల్సేలాగ సూడు!' అంటూ ప్రార్థిస్తున్నాడు పడమటయ్య.

డేగ కళ్లు చురుగ్గా కదులుతున్నాయి. ప్రత్యర్థి కదలికలను కనిపెడుతూ ఒక్కసారిగా గాల్లోకి లేచి సేతువను కుడికాలుతో తన్నింది. సేతువ మెడకు కత్తి తగిలి అది నేలకూలింది. మరి లేవలేదు.

డేగ గెలవడంతో పడమటయ్యను అక్కడున్నవారంతా పొగడ్తలతో ముంచెత్తారు. దాంతో అతనికి ప్రపంచాన్ని జయించినంత ఆనందమేసింది. ఉద్వేగంతో బరిలోకి దూకి డేగను ప్రేమగా చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టాడు. గోళ్లరక్కులు తప్ప కత్తి గాయాలు లేనందుకు సంతోషించాడు. చచ్చి పడున్న సేతువను చూడగానే అతని మనసు చివుక్కుమంది.

''సూసిరమ్మంటే కాల్చొచ్చేసిన అనుమంతులోరి లాగ ఒడించమంతే ఏకంగ సంపేసినవు! అదేమన్న నీ సెత్రువా? నీ జాతి తన అసలు సెత్రువును కానుకోనేక పోతున్నది గాబట్టే.. అనాదిగ కోడిపందేలు ఇలాగ సాగుతున్నయి'' అన్నాడు డేగతో.

పందెం డబ్బులను పడమటయ్య చేతిలో పెట్టి..

''ఏటో అనుకున్నను, గట్టి ముసలోడివే! గెలిసెయ్య నీకి వొయసడ్డంగాదు, ఒపిగ్గ సెమిత్తే ఓరినైన ఇజియం వరిత్తదని నిరూపించినవు! నిన్ను సులకన సేసి మాట్లాడినాను. సెమించు'' అంటూ తలొంచాడు సూరిబాబు.

పడమటయ్య పోయిన తనడబ్బు మళ్లా తిరిగొచ్చినందుకు సంతోషపడిపోయాడు.

తన పంతం నెగ్గినందుకు మురిసిపోయాడు.

''నీ తప్పు తెలిసికొని తలొంచావు. అది సాలు!'' అన్నాడు సూరిబాబుతో.

''కోడిపందేలు మడుసులలో పగలూ, కచ్చలూ పుట్టిత్తయి! అందువొల్లే పల్నాడిద్దం, బొబ్బిలిద్దం జెరిగాయంట. ఇల్లు ఒల్లు గుల్లసేసే ఇట్టాంటి పందేలు నానికెప్పుడు ఆడనుగాక ఆడను'' అంటూ ఒట్టుపెట్టాడు.

అంతలోనే..

''పోలీసోలొత్తున్నరు... పారిపొండి... పారిపొండి'' అంటూ ఎవరో అరిచారు. అంతే, జనం చెట్టుకొకరుగా పుట్టకొకరుగా పరుగులు తీశారు.

పడమటయ్యకు పందెం గెల్చానన్న ఆనందం ఆవిరైపోయింది. భయం నిలువెల్లా ఆవహించింది. పోలీసోళ్లకు దొరికితే స్టేషన్కు తీసుకుపోయి, కోర్టుకు కట్టేస్తారన్న భయంతో అడ్డదారిలో డేగను పట్టుకుని కొంత దూరం పరుగు తీశాడుగానీ, వయసు సహకరించక ఆగిపోయాడు. దారి పక్కన పశువులపాక ఉంటే అందులోకి దూరాడు. పక్కనే ఉన్న కుక్కిమంచం వాల్చి, దాని మీద డేగనుంచి తువ్వాలుతో పూర్తిగా కప్పేశాడు. కీడెంచి జేబులోని డబ్బును ముంజూరులో దోపాడు. మంచమ్మీద ఓ వారగా పడుకున్నాడు.

హెడ్ కానిస్టేబుల్, ఓ కుర్ర కానిస్టేబుల్ను వెంటబెట్టుకుని వేగంగా బైక్ మీదొచ్చి బరి దగ్గరాపాడు. బరిలో రాలిన ఈకలూ, చిందిన నెత్తురూ తప్ప అక్కడెవ్వరూ కనిపించలేదు. ఇద్దరూ తమ డేగకళ్లతో ఆ చుట్టుపక్కలంతా గాలించారు గానీ లాభం లేకపోయింది.

''మనమొస్తున్నట్టు ఏనా కొడుకో ఉప్పందించేశాడు. వచ్చినందుకు కనీసం పెట్రోల్ చార్జీలకన్నా గిట్టుబాటు కాలేదు'' అసహనంగా అన్నాడు హెడ్ కానిస్టేబుల్.

వేరే దారి కనిపిస్తే అటెళ్తే గిట్టుబాటు అవుతుందేమోనని బైక్ను అటు పోనిచ్చాడు.

బిక్కుబిక్కుమని పాకలోవున్న పడమటయ్యకు బైక్ శబ్దం వినగానే ఒళ్లంతా ముచ్చెమటలు పోశాయి. ఊపిరి బిగబెట్టి పడుకున్నాడు. బైక్ పాకను దాటి ముందుకు పోయింది. దాంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. అంతలోనే బైక్ మళ్లీ వెనక్కి తిరిగొచ్చి సడన్ బ్రేక్తో పాకముందాగింది.

ఆ శబ్దానికి పడమటయ్య హడలిపోయాడు. గురక పెట్టి నిద్రపోతున్నట్టు నటిస్తూ గట్టిగా కళ్లు మూసుకున్నాడు. హెడ్ కానిస్టేబుల్, కుర్ర కానిస్టేబుల్తో కలిసి పాకలోకి దూరాడు. పడమటయ్యను లాఠీతో తట్టి లేపాడు. బద్ధకం నటిస్తూ లేచాడు పడమటయ్య.

''ఏటి బాబు... ఇలా వొచ్చరు?'' అని అడిగాడు ఏమీ తెలీనట్టు.

''తాతా.. కోడిపందేలు ఆడేవారు ఎటెల్లారో చూశావా?'' అడిగాడు హెడ్ కానిస్టేబుల్.

''సూన్నేదు బాబు... పొలం పన్జేసి నిద్రోనినా... మత్తుగ నిద్రట్టేసింది'' చెప్పాడు పడమటయ్య.

హెడ్ కానిస్టేబుల్కు పడమటయ్య మీద ఏ మాత్రం అనుమానం రాలేదు. ఇద్దరూ నిరాశగా పాకలోంచి బయటకొచ్చారు. పడమటయ్య మరోసారి ఊపిరి పీల్చుకున్నాడు. అంతలో అంతవరకూ కిక్కురుమనని డేగ 'కొక్కొరోకో' అని కూసింది. పడమటయ్య గుండె గుభేలుమంది. 'ఎంత పన్జేసినవే డేగ... పోలీసు డేగలకు నన్నప్పగించేసినవు గదే' అంటూ గొణిగాడు.

హెడ్ కానిస్టేబుల్ తిరిగి పాకలోకి పరుగునొచ్చి, తువ్వాలు కింద కదులుతున్న డేగను పట్టుకుని చంకలో ఇరికించుకున్నాడు.

''అమ్మ ముసలినాయాల... ఎంత నాటకమాడావురా?'' అన్నాడు కళ్లెర్రజేసి.

పడమటయ్య జేబులను, అక్కడి పరిసరాలను కుర్ర కానిస్టేబుల్ చేత వెతికించాడుగానీ ఏమీ దొరకలేదు.

''కోడిపుంజుంటే డబ్బులు కూడా ఉంటాయి. ఎక్కడ దాచావో తియ్యరా... లేకపోతే మక్కలిరగొట్టీగలను'' అంటూ లాఠీ ఎత్తాడు హెడ్ కానిస్టేబుల్. దాంతో బెదిరిపోయిన పడమటయ్య.. హెడ్ కానిస్టేబుల్ కాళ్లమీద పడిపోయాడు.

''పుంజు ఓడిపోనది బాబూ! డొబ్బులు పోనయి'' అని అబద్ధం చెప్పాడు.

''ఈతూరికి సెమించి ఒదిలేయండి'' అంటూ బతిమిలాడాడు. హెడ్ కానిస్టేబుల్ ఎత్తిన లాఠీ దించి..

''పండగపూట హింసెందుకని వదిలేస్తున్నాను. ఇంకెప్పుడూ కోడిపందేలాడకు!'' అన్నాడు. డేగనుచూసి పళ్లు చప్పరిస్తూ..

''వచ్చినందుకు కోడిపుంజు గిట్టుబాటయ్యింది. పండక్కొచ్చిన అల్లుళ్లకు ఎంచక్కా పుంజు మాంసంతో భోజనమెట్టొచ్చు'' అంటూ డేగను పట్టుకుని హుషారుగా పాకలోంచి బయటకొచ్చాడు. డేగను పట్టుకుపోతుంటే విలవిల్లాడిపోయాడు పడమటయ్య.

'డేగనిడిసి నానుండగలనా?' అనుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. తనను గెలిపించిన డేగ, ఓడిందని అబద్ధం చెప్పినందుకు తనను తను అసహ్యించుకున్నాడు. బైక్ స్టార్ట్ చేసిన శబ్దం వినగానే ఒక నిశ్చయానికొచ్చి, ముంజూరులో దాచిన డబ్బును గాబరాగా తీసి, ఒక్కుదుటున బయటకొచ్చాడు.

''నాను అబద్ధం సెప్పినను బాబు. నా డేగ ఓడిపోనేదు.. గెల్సినాది! పోగొట్టుకున్న నా పరువును, డొబ్బును గెల్సినాది! నన్ను ఎటకారం సేసినోణ్ని తలొంచుకునేల గెల్సినాది! ఆ డబ్బేబాబు ఇది. పన్నెండేలు! తీస్కోని గొర్రిపోతిని కొని తమరి అల్లుల్లకు ఏట మాసంతో బోజనం ఎట్టండి. నా డేగను నాకొగ్గీయండి బాబు.. మీకు పున్నెముంటది'' అంటూ బోరున ఏడ్చాడు.

హెడ్ కానిస్టేబుల్ తన పంట పండిందని ఉప్పొంగిపోయాడు. మారోమాట లేకుండా డేగను పడమటయ్య చేతిలో పెట్టి, డబ్బును జేబులో కుక్కుకున్నాడు. ఆ వెంటనే బైక్ను ముందుకు ఉరికించాడు.

పడమటయ్యకు డబ్బు పోయిందన్న బాధ కాస్త కూడా లేదు! తన డేగ తనకు దక్కినందుకు సంతోషంగుంది! గద్దతో పోరాడి రక్షించిన కోడిపిల్లలను రెక్కలమాటున దాచిన తల్లికోడిలా డేగను ప్రేమగా అక్కున చేర్చుకున్నాడు.

'అందరి కండ్లూ నా డేగమీదే అడిపోనయి. బేగ ఇంటికెల్లి దిస్టి తీసియాలి' అనుకుంటూ ఇంటివైపు నడక మొదలుపెట్టాడు.

## బొడ్డేడ బలరామస్వామి



పందెం కోళ్లను ప్రాణానికి ప్రాణంగా, కన్నబిడ్డల కన్నా మక్కువగా చూసుకుంటారు కొందరు యజమానులు. అలాంటి ఓ యజమాని కథే.. 'డేగ'! కన్న ప్రేమే కాదు.. పెంచిన మమకారం కూడా ఎంతో గొప్పదని నిరూపించిందీ కథ! కథా రచయిత బొడ్డేడ బలరామస్వామిది అనకాపల్లి జిల్లా కశింకోట గ్రామం. ప్రైవేట్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇప్పటివరకూ ముప్పైకి పైగా కథలు, కొన్ని కవితలు రాశారు. 'ఆకుపచ్చని చంద్రుడు' నవల.. చతురలో ప్రచురితమైంది. 'సముద్రం' కథకు.. 2017లో స్వాతి మాసపత్రిక నుంచి 'అనిల్ అవార్డు' అందుకున్నారు. అనకాపల్లి గౌరీ గ్రంథాలయం నిర్వహించిన కథల పోటీలో 'ఆడపిల్ల' కథకు ద్వితీయ బహుమతి దక్కగా.. డా. సి. నారాయణరెడ్డి గారి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. 'కళింగ పౌరుషం' చారిత్రక కథకు జాగృతి వార పత్రిక నుంచి ప్రోత్సాహక బహుమతి దక్కింది. నమస్తే తెలంగాణ – ముల్కనూరు సాహితీ పీఠం నిర్వహించిన కథల పోటీ – 2021లో 'కీడు గుడెసె' కథకు, హాస్యానందం పత్రిక నిర్వహించిన కథల పోటీలో 'పట్టుచీర' కథకు ప్రత్యేక బహుమతులను అందుకున్నారు. వీరి 'సముద్రం' కథ హిందీలోకి, 'ఒక ప్రయాణం' కథ కన్నడంలోకి అనువాదమయ్యాయి.